# ఓటు హక్కు అత్యంత ప్రతిష్ట

## పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన

### ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్, అక్షిత ప్రతినిధి:** ఉప్పల్ భాగాయత్‌లోని అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఉప్పల్ భాగాయత్ హెచ్ఎండీఏ లేఅవుట్ పరిధిలో నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని పట్టభద్రులకు అవగాహన కల్పించారు. ఉప్పల్ భాగాయత్‌లోని గెలాక్సీ కాల్టన్ హిల్ అపార్ట్‌మెంట్స్ ..మిగతా 2లో




www.aakshitha.com

People's voice

అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

సోమవారం | 26 | అక్టోబర్ | 2026 | పేజీలు: 08


# "అసైన్డ్ భూమి... లీజుకు హక్కెవరిది?"

## పేదలకు కేటాయించిన అసైన్డ్ భూమి ప్రైవేట్ కాంక్రీట్ ప్లాంట్ చేతికి ఎలా వెళ్లింది?

### పాటి గ్రామంలో 38 గుంటల భూమిపై లీజు వివాదం

### రూ.80 వేల నెలవారీ అద్దె

### ఏటా 10 శాతం పెంపు నిబంధన

### తహసీల్దార్ నోటీసులతో వెలుగులోకి వచ్చిన వ్యవహారం

### అధికారుల విచారణ ఎక్కడి వరకు?





**పటాన్‌చెరు, అక్షిత ప్రతినిధి :** పేదలకు భూమిని కేటాయించింది వారి జీవనోపాధి కోసం.. కానీ అదే అసైన్డ్ భూమి వాణిజ్య కార్యకలాపాలకు లీజుకు వెళ్లిందనే వ్యవహారం ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తోంది. ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యత వహించాల్సిన రెవెన్యూ యంత్రాంగం ఈ వ్యవహారంపై ఏం తేల్చనుంది? అసైన్డ్ భూమిని లీజుకు ఇచ్చేందుకు అసలు లబ్ధిదారుడికి చట్టబద్ధమైన అధికారం ఉందా? నిబంధనలకు విరుద్ధంగా లావాదేవీలు జరిగితే బాధ్యత ఎవరిది? సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాటి గ్రామంలోని సర్వే నంబర్ 269లో ఉన్న 38 గుంటల అసైన్డ్ భూమికి సంబంధించి వెలుగులోకి వచ్చిన వ్యవహారం.. ఎస్.ఎస్.ఆర్. రెడీమిక్స్ ప్లాంట్ ఈ భూమిని వినియోగిస్తున్నట్లు రెవెన్యూ శాఖ నోటీసుల్లో పేర్కొనడం, సంస్థ ఐదేళ్ల లీజు ఒప్పందాన్ని ఆధారంగా చూపుతూ వివరణ సమర్పించడం ఈ వ్యవహారంలో కీలక పరిణామాలు.

**నోటీసులే ప్రశ్నిస్తున్నాయి.. అసైన్డ్ భూమి లీజు చట్టబద్ధమేనా?**

పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయం 18 సెప్టెంబర్ 2026న జారీ చేసిన ఫారం-1, ఫారం-2 నోటీసుల ..మిగతా 2లో

# అప్రమత్తత అవసరం

### బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం

### జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

### అక్టోబర్ 28న అక్కడక్కడా అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం

### రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

### ఉరుములు మెరుపులు ఈదురుగాలుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి



**ఖమ్మం /అక్షిత బ్యూరో:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఖమ్మం జిల్లాలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదివారం ఒక ..మిగతా 2లో

## సంస్కృతికి ప్రతీక

# అలయ్ బలయ్

### ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్ :** అలయ్ బలయ్ వంటి కార్యక్రమాలు తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తూ ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని పెంపొంది స్తాయని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచర సమితి ఆధ్వర్యంలో, మహబూబ్‌నగర్ నగరం లోని గడియారం చౌరస్తా వద్ద ఏర్పాటుచేసిన అలయ్ బలయ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, ప్రజలందరూ కలిసికట్టుగా, పరస్పర ..మిగతా 2లో

## కరువు గట్టెక్కేందుకు

# పటిష్ట వ్యూహం



### కరువును రాజకీయం చేయొద్దు!

### కాళేశ్వరం ప్రాజెక్టుపై నిపుణుల నివేదిక ఆధారంగా నిర్ణయం

### కరువు నివారణకు అందరూ సమష్టిగా కృషి చేయాలి

### భూపాలపల్లి ఎమ్మెల్యే గంట సత్యనారాయణ రావు

**భూపాలపల్లి, అక్షిత ప్రతినిధి:** కరువు పరిస్థితులను బిఆర్ఎస్ నాయకులు రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవడం సరికాదని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను మానుకోవాలని భూపాలపల్లి ..మిగతా 2లో

## ఓటు హక్కు అత్యంత ప్రతిష్ట

**మొదటి పేజీ తరువాయి...**

కాలభైరవ స్వామి టెంపుల్ రోడ్‌లో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందేందుకు అర్హులైన పట్టభద్రులు అనుసరించాల్సిన ఓటరు నమోదు ప్రక్రియ గురించి నివాసితులకు వివరించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ నిర్ణీత విధానంలో తమ పేర్లను పట్టభద్రుల ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రజాస్వామ్య బలోపేతంలో ప్రతి ఓటరు భాగస్వామ్యం కీలకమని బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. పట్టభద్రులు ఓటరు నమోదుపై నిర్లక్ష్యం చేయకుండా, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. పట్టభద్రులందరూ చురుకుగా పాల్గొని ప్రజాస్వామ్య ప్రక్రియలో తమ భాగస్వామ్యాన్ని నిర్ధారించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ నివాసితులు, పట్టభద్రులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సంస్కృతికి ప్రతీక అలయ్ బలయ్

**మొదటి పేజీ తరువాయి...**

గౌరవంతో మెలుగుతూ మహబూబ్‌నగర్ నగర ప్రతిష్టను మరింత పెంచేందుకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అయ్యప్ప దీక్షా చేపట్టి మండల కాలం పాటు భగవంతున్ని ఆరాధిస్తూ సర్వేజనా సుఖినోభవంతు అని నిరంతరం అయ్యప్ప స్వామి శరణ ఘోషతో అందరినీ ఆధ్యాత్మికత వైపు నడిపించే అయ్యప్ప స్వాములు, అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచర సమితి ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజలంతా ఒకచోట చేరి పండుగలు, సంప్రదాయాలను జరుపుకోవడం తెలంగాణ సంస్కృతిలోని గొప్పతనాన్ని చాటిచెబుతుందని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో పరస్పర స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. ప్రజలందరూ ఐకమత్యంతో ముందుకు సాగుతూ నగర అభివృద్ధికి, ప్రతిష్ట పెంపునకు తమ వంతు సహకారం అందించాలని ఆయన ఆకాంక్షించారు. అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించిన అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి, పాలమూరు శాఖ ప్రతినిధులను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, కార్పొరేటర్లు రఘు యాదవ్, ప్రశాంత్, పాతూరి రమేష్ బాబు, అనుప ఆంజనేయులు, కిషన్ నాయక్, గోవర్ధన్ గౌడ్, నాయకులు రమేష్ యాదవ్, సతీష్ కుమార్ .జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు రాజు దేశపాండే, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సీమా నరేందర్, నరేందర్ గుప్త, పాలమూరు జిల్లా అధ్యక్షులు భాను ప్రకాష్, ప్రధాన కార్యదర్శి ఆరెళ్ళ రమేష్, అన్నధాన కమిటీ ప్రధాన కార్యదర్శి మంత రవి జె. శంకర్, కోశాధికారి రాపర్తి శ్రీను,నగర కమిటీ అధ్యక్షులు నర్సింహారావు , ప్రధాన కార్యదర్శి యాదయ్య గౌడ్, కోశాధికారి బాల ప్రసాద్ కార్యవర్గ సభ్యులు కొండల్, ఎబిన్ సంతోష్, కుర్మయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అప్రమత్తత అవసరం

**మొదటి పేజీ తరువాయి...**

ప్రకటనలో తెలిపారు. భారత వాతావరణ శాఖ అక్టోబర్ 25 న జారీ చేసిన వాతావరణ బులెటిన్ ప్రకారం ఈ నెల 27న జిల్లాలో అక్కడక్కడా ఉరుములు మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. అక్టోబర్ 28న జిల్లాలో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలతో పాటు అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిందని పేర్కొన్నారు. అక్టోబర్ 29న కూడా అక్కడక్కడా ఉరుములు మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు.వర్షాల నేపథ్యంలో రైతులు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఉరుములు మెరుపులు సంభవించే సమయంలో ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని చెట్ల క్రింద విద్యుత్ స్తంభాల సమీపంలో ఆశ్రయం పొందరాదని కలెక్టర్ సూచించారు.

జిల్లాలోని సంబంధిత శాఖల అధికారులు వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికలు జిల్లా యంత్రాంగం జారీ చేసే సూచనలను ప్రజలు రైతులు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# “అసైన్డ్ భూమి... లీజుకు హక్కెవరిది?”

**మొదటి పేజీ తరువాయి...**

ప్రకారం, పాటి గ్రామ సర్వే నంబర్ 269లోని 38 గుంటల భూమి అసైన్డ్ భూమిగా పేర్కొనబడింది. సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారి నివేదిక, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా భూమి లీజు వ్యవహారం అధికారుల దృష్టికి వచ్చినట్లు నోటీసుల్లో ఉంది. అసలు లబ్ధిదారుడిగా పేర్కొన్న దర్గా గోపాల కృష్ణకు ఒక నోటీసు, భూమిని వినియోగిస్తున్న ఎస్ఎస్ఆర్ రెడీమిక్స్ ప్లాంట్‌కు మరో నోటీసు జారీ చేశారు. 15 రోజుల్లో వివరణ సమర్పించాలని, చట్టప్రకారం తదుపరి చర్యలు ఎందుకు తీసుకోకూడదో తెలియజేయాలని అధికారులు కోరారు. ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. అసైన్డ్ భూమి బదిలీపై చట్టపరమైన ఆంక్షలు ఉన్నప్పుడు, ఆ భూమిని వాణిజ్య అవసరాలకు లీజుకు ఇచ్చే పరిస్థితి ఎలా ఏర్పడింది? లీజు ఒప్పందం చేసుకునే ముందు భూమి స్వభావాన్ని, కేటాయింపు షరతులను పరిశీలించారా? పరిశీలిస్తే ఏ ఆధారాలతో లీజు ఒప్పందం కుదిరింది? పరిశీలించకపోతే ఆ నిర్లక్ష్యానికి బాధ్యత ఎవరు వహించాలి?



### నెలకు రూ.80 వేల అద్దె.. ఏటా 10 శాతం పెంపు!

ఎస్ఎస్ఆర్ కాంక్రీట్ సంస్థ సమర్పించినట్లు ఉన్న వివరణ పత్రంలో, 30 సెప్టెంబర్ 2023న ఐదేళ్ల కాలానికి లీజు ఒప్పందం చేసుకున్నట్లు పేర్కొంది. ఆస్తి పన్ను చెల్లింపులు చేస్తున్నామని, సంబంధిత పత్రాలను అధికారుల పరిశీలనకు సమర్పిస్తున్నామని సంస్థ తెలిపింది. అందుబాటులో ఉన్న లీజు పత్రంలోని వివరాల ప్రకారం, నెలవారీ అద్దె రూ.80 వేలుగా ప్రారంభమై ప్రతి సంవత్సరం 10 శాతం పెంపు ఉండే నిబంధన కనిపిస్తోంది. ఆ లెక్క ప్రకారం నెలవారీ అద్దె తదుపరి సంవత్సరాల్లో లక్ష రూపాయలను దాటే స్థాయికి చేరుతుంది. అద్దె చెల్లింపులు జరుగుతున్నాయన్న విషయం ఒకటి.. అసైన్డ్ భూమిని లీజుకు ఇవ్వడం చట్టబద్ధమా కాదా అన్నది మరో విషయం. ఆస్తి పన్ను చెల్లించడం, ఒప్పంద పత్రం కలిగి ఉండడం మాత్రమే అసైన్డ్ భూమిపై బదిలీ హక్కును నిర్ధారించవు.

ప్రజల ముందున్న ప్రధాన ప్రశ్నలు? అధికారుల జవాబు ఎలా ఉంటుంది? లీజు ఒప్పందం ఉందని చెప్పడం సరిపోతుందా? ఆ ఒప్పందానికి చట్టబద్ధమైన ఆధారం ఏమిటో అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం లేదా?

### పన్ను రసీదులున్నాయంటే భూమిపై హక్కులు వచ్చినట్టేనా?

తమ వివరణలో సంస్థ లీజు పత్రం, ఆస్తి పన్ను చెల్లింపులను ప్రస్తావించింది. అయితే భూమి కేటాయింపు ఉత్తర్వులు, అసైన్డ్ పట్టా షరతులు, లీజుకు ఇచ్చిన వ్యక్తికి ఉన్న అధికారం, సంబంధిత అనుమతులు, రెవెన్యూ రికార్డులు పరిశీలించిన తర్వాతే అసలు విషయం తేలుతుంది. భూమిని కేటాయించిన ఉద్దేశం ఏమిటి? ఆ ఉద్దేశానికి విరుద్ధంగా వినియోగం జరుగుతోందా? లీజు ఒప్పందం సంబంధిత చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ఉందా? అసైన్డ్ భూముల పరిరక్షణకు బాధ్యత వహించే అధికారులు ఈ ప్రశ్నలకు పత్రాలతో సమాధానం చెప్పాలి. ఒకవేళ చట్ట ఉల్లంఘనలు నిర్ధారణ అయితే, సంబంధిత చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాల్సిందే. అదే సమయంలో సంస్థ సమర్పించిన వివరణను, లీజు పత్రాలను, ఇతర ఆధారాలను పరిశీలించి నిష్పక్షపాత నిర్ణయం తీసుకోవడం కూడా అధికారుల బాధ్యతే.

### రెవెన్యూ అధికారుల తదుపరి చర్యలేమిటి?

తహసీల్దార్ కార్యాలయం నోటీసులు జారీ చేసిన తర్వాత విచారణ ఏ దశలో ఉంది? సంస్థ సమర్పించిన వివరణను అధికారులు పరిశీలించారా? లీజు ఒప్పందం చట్టబద్ధతపై అభిప్రాయం తీసుకున్నారా? భూమి కేటాయింపు రికార్డులను పరిశీలించారా? ఏవైనా తుది ఉత్తర్వులు జారీ చేశారా? ఈ వివరాలపై అధికారిక స్పష్టత అవసరం. నోటీసులు జారీ చేయడం ఒక ప్రక్రియ మాత్రమే. వాటి అనంతరం జరిగిన విచారణ, ఆధారాల పరిశీలన, తీసుకున్న నిర్ణయాలే అసలు విషయం.

### జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలి!

సంగారెడ్డి జిల్లా కలెక్టర్, సంబంధిత రెవెన్యూ ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలి. అసైన్డ్ భూమి కేటాయింపు నుంచి లీజు ఒప్పందం వరకు ఉన్న రికార్డులను పరిశీలించాలి. భూమి వినియోగానికి సంబంధించిన అనుమతులు, పన్ను చెల్లింపులు, లీజు నిబంధనలు, అసైన్డ్ పట్టా షరతులను ధ్రువీకరించాలి.

చట్ట ఉల్లంఘన నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. ఉల్లంఘన జరగలేదని తేలితే దానికి సంబంధించిన కారణాలను, ఆధారాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలి.

అసైన్డ్ భూముల పరిరక్షణ విషయంలో ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సిన బాధ్యత అధికారులదే. లీజు ఒప్పందం పేరుతో చట్టపరమైన పరిమితులను పక్కన పెట్టే అవకాశం ఉందా? లేక అన్ని నిబంధనలు పాటించబడ్డాయా? ఈ వ్యవహారంపై అధికారిక విచారణే వాస్తవాలను తేల్చాలి.

### ఎస్ఎస్ఆర్ కాంక్రీట్ సంస్థకు ఇంటి నంబర్ ఎలా జారీ చేశారు?

జీహెచ్ఎంసీ అధికారులు ఏ నిబంధనల ప్రకారం ఇంటి నంబర్ కేటాయించారు? అనుమతులపై స్పష్టత ఇవ్వాలి...!

పాటి గ్రామంలోని అసైన్డ్ భూమి లీజు వ్యవహారం ఇప్పటికే రెవెన్యూ శాఖ నోటీసులతో చర్చనీయాంశంగా మారగా, తాజాగా మరో కీలక ప్రశ్న ముందుకొస్తోంది. ఎస్ఎస్ఆర్ కాంక్రీట్ సంస్థకు సంబంధించి ఇంటి నంబర్ లేదా డోర్ నంబర్ జారీ చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు ఏ నిబంధనల ప్రకారం కేటాయించారు? దానికి సంబంధించిన దరఖాస్తు, క్షేత్రస్థాయి పరిశీలన నివేదిక, ఆస్తి పన్ను అసెస్‌మెంట్ పత్రాలు, అనుమతుల వివరాలు ఏమిటి? పాటి గ్రామం సర్వే నంబర్ 269లోని 38 గుంటల అసైన్డ్ భూమిని ఎస్ఎస్ఆర్ రెడీమిక్స్ ప్లాంట్ వినియోగిస్తున్నట్లు పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయం జారీ చేసిన నోటీసుల్లో పేర్కొంది. ఈ నేపథ్యంలో సంస్థకు జారీ చేసిన ఇంటి నంబర్ లేదా సంబంధిత రికార్డుల చట్టబద్ధతపై కూడా స్పష్టత అవసరమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇంటి నంబర్ కేటాయింపు, ఆస్తి పన్ను నమోదు, భవన నిర్మాణ అనుమతి అనేవి వేర్వేరు అంశాలు. ఒకవేళ ఇంటి నంబర్ లేదా పన్ను అసెస్‌మెంట్ ఇచ్చి ఉంటే, దానివల్ల భూమిపై యాజమాన్య హక్కులు లేదా అసైన్డ్ భూమిని లీజుకు ఇచ్చే చట్టబద్ధమైన అధికారం స్వయంచాలకంగా ఏర్పడదు. అందువల్ల సంబంధిత అధికారులు ఇంటి నంబర్ కేటాయింపు ఉత్తర్వులు, దరఖాస్తు, భూమి వివరాలు, పన్ను అసెస్‌మెంట్ రికార్డులు, భవన అనుమతులపై స్పష్టమైన సమాచారం ఇవ్వాలి. భూమి అసైన్డ్ స్వభావాన్ని అధికారులు పరిగణనలోకి తీసుకున్నారా? కేటాయింపునకు ముందు ఏ పత్రాలను పరిశీలించారు? ఈ వివరాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉంది. అసైన్డ్ భూమి లీజు వ్యవహారం ఒకవైపు.. జిహెచ్ఎంసి రికార్డుల్లో ఇంటి నంబర్ కేటాయింపు మరోవైపు! ఈ రెండు అంశాలపై సంబంధిత శాఖలు సమన్వయంతో విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలి. ఉల్లంఘనలు జరిగాయి.. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.

## కరువు గట్టెక్కేందుకు పటిష్ట వ్యూహం

**మొదటి పేజీ తరువాయి...**

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు.భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు బట్టు కరుణాకర్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు..వాతావరణ మార్పుల ప్రభావంతో వర్షాలు తగ్గి కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరించిన నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు చర్యలకు సిద్ధమైందని తెలిపారు. రైతులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు పార్టీలకు అతీతంగా కరువును ఎదుర్కొనేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### నిపుణుల నివేదిక తర్వాతే కాళేశ్వరంపై నిర్ణయం

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన లోపాలు, మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘటనపై బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి ఇంజినీర్లు గతంలో వ్యక్తం చేసిన అభ్యంతరాలను పట్టించుకోకపోవడం వల్లే ప్రస్తుత పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ప్రాజెక్టు మరమ్మతుల విషయంలో నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా ముందుకెళ్తామని, ప్రజాధనం వృథా కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరందించే ప్రత్యామ్నాయాలపైనా ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు.



# డాక్టర్ ఎస్.ఎన్. సుబ్బారావు "భాయిజీ" కి మేయర్ కొలగాని శ్రీనివాస్ ఘన నివాళులు



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, చంబల్ గాంధీగా పేరుగాంచిన డాక్టర్ ఎస్.ఎన్. సుబ్బారావు (భాయిజీ) ఐదవ వర్ధంతి (పుణ్యతిథి) సందర్భంగా కరీంనగర్ నగరపాలక సంస్థ తీగలగుట్టపల్లి లోని మేయర్ క్యాంప్ కార్యాలయం లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఘనంగా నివాళులర్పించారు. అక్టోబర్ 25 నుంచి 27 వరకు మూడు రోజులపాటు నిర్వహించనున్న వర్ధంతి కార్యక్రమాలను ఈ సందర్భంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ డాక్టర్ ఎస్.ఎన్. సుబ్బారావు తన జీవితమంతా దేశసేవకు, యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం పెంపొందించడానికి అంకితం చేసిన మహనీయులని కొనియాడారు. కేవలం 13 ఏళ్ల వయసులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ఆయన, స్వాతంత్ర్యం అనంతరం గాంధేయ సిద్ధాంతాల స్ఫూర్తితో సమాజ సేవకు తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. చంబల్ లోయల్లో బందిపోట్లుగా జీవించిన వారిని అహింసా మార్గంలోకి తీసుకువచ్చి, జనజీవన స్రవంతిలో కలిసేలా కృషి చేసిన గొప్ప మానవతావాది భాయిజీ అని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ సేవా ఆశ్రమాన్ని స్థాపించి, వారికి పునరావాసం కల్పించడంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఆచార్య వినోబా భావే, జయప్రకాశ్ నారాయణ్ వంటి ప్రముఖుల స్ఫూర్తితో పనిచేస్తూ శాంతి, అహింస, మానవతా విలువలను సమాజంలో పెంపొందించేందుకు నిరంతరం కృషి చేశారని తెలిపారు. యువతే దేశానికి వెన్నెముక అనే నమ్మకంతో నేషనల్ యూత్ ప్రాజెక్ట్ ను స్థాపించి, గ్రామస్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల వరకు యువజన శిబిరాలను నిర్వహించారని మేయర్ పేర్కొన్నారు. జాతీయ సమైక్యత, సమగ్రత, మతసామరస్యాన్ని కాపాడటంతో పాటు ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల సమయంలో సేవా కార్యక్రమాల ద్వారా యువతలో సామాజిక బాధ్యతను పెంపొందించారని అన్నారు. పద్మశ్రీ, పద్మవిభూషణ్ వంటి పురస్కారాలను స్వీకరించకుండా తన నిరాడంబర జీవితానికి, సేవా మార్గానికి ప్రాధాన్యతనిచ్చిన త్యాగశీలి భాయిజీ అని కొనియాడారు. జీవితాంతం బ్రహ్మచారిగా ఉంటూ 94 ఏళ్ల వయసులో భారతమాత సేవలోనే తన జీవితాన్ని ముగించిన ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

భాయిజీ మార్గదర్శకత్వంలో తాను కూడా దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం వంటి విలువలను అలవర్చుకున్నానని, ప్రజాసేవలో ముందుకు సాగేందుకు ఆయన ఆశీస్సులు, స్ఫూర్తి తనకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తాయని మేయర్ తెలిపారు. భాయిజీ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని, ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమం నేషనల్ యూత్ ప్రాజెక్ట్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్వైపీ కే. యాదవ రాజు అధ్యక్షతన నిర్వహించబడింది. అక్టోబర్ 25 నుంచి 27 వరకు మూడు రోజులపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా ఆంగ్లభాష రిసోర్స్ పర్సన్ గడ్డం జగదీష్, మై భారత్ కరీంనగర్ మాజీ ప్రోగ్రామ్ కన్వీనర్ రవీందర్, గాజ శివరాం, ఎన్నం ప్రకాష్, గాండ్ల నరేష్, వడ్డేపల్లి రాజు, కొలగాని కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల సేవలు తరతరాలకు స్ఫూర్తి.. భాయిజీ ఆశయాలే యువతకు మార్గదర్శకం.

# పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా సైకిల్ ర్యాలీ



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ ఆధ్వర్యంలో నగరంలో 20 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీని పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సైకిల్ ర్యాలీలో కరీంనగర్ రన్నర్స్ మరియు సైక్లిస్ట్ అసోసియేషన్ సభ్యులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, డాక్టర్లు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఆదివారం ఉదయం పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ బస్ స్టేషన్, ప్రతిమ మల్టీప్లెక్స్, గీతాభవన్ చౌరస్తా, మంకమ్మతోట లోని పొన్నం కాంప్లెక్స్, శివ థియేటర్ సర్కిల్, కెమిస్ట్ భవన్ మీదుగా సాగింది. అనంతరం ఎలక్ట్రిసిటీ కార్యాలయం వద్ద యూ టర్న్ తీసుకుని, కోర్ట్ చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, గాంధీ చౌరస్తా, నాఖా చౌరస్తా, బోట్ చౌరస్తా, కమాన్ చౌరస్తా, తిరిగి బస్టాండ్ సర్కిల్, ప్రతిమ మల్టీప్లెక్స్ మీదుగా ప్రయాణించి పోలీస్ పరేడ్ గ్రౌండ్ వద్ద ముగిసిందని సీపీ తెలిపారు. కార్యక్రమ అనంతరం సీపీ ర్యాలీలో పాల్గొన్న సభ్యులకు అమరవీరుల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు.

**"అక్టోబర్ 31 వరకు వారోత్సవాలు"**

పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో ప్రజలను భాగస్వామ్యం చేసే ఉద్దేశ్యంతో అక్టోబర్ 31వ తేదీ వరకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఏసిపిలు వెంకటస్వామి, విజయకుమార్ కమిషనరేట్ చెందిన ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు. వీరితో పాటు కరీంనగర్ కమిషనరేట్ రన్నర్స్ మరియు సైక్లిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మహేష్ పాసుల, డాక్టర్ కిరణ్, అడ్వకేట్ తిరుపతి లతో పాటు పాఠశాల విద్యార్థులు మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# ఏకగ్రీవంగా ఫ్రెండ్లీ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవరం ఎన్నిక



**కరీంనగర్ అక్షిత న్యూస్:** కరీంనగర్ ఫ్రెండ్లీ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. జి.పి. గ్రౌండ్‌లో నిర్వహించిన సమావేశంలో నూతన అధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది కె.సి.మూర్తి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కొండ రాజయ్య, కోశాధికారిగా రమణారెడ్డి ఎంపికయ్యారు. ఉపాధ్యక్షులుగా నర్సింహారెడ్డి, మాద మల్లారెడ్డి, శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కొండ్ల సుభాష్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా బుర్ర జగదీశ్వర్, రాజేందర్ వ్యవహరించనున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియను ఎన్నికల అధికారులు భీంరావు, పర్శరాములు, ఈశ్వర్ ప్రసాద్ నిర్వహించారు. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం వచ్చే ఆదివారం ఉదయం గిద్దెపెరుమాండ్ల ఆలయంలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

## అయోధ్య, కాశీ ఉచిత యాత్ర ప్రారంభం



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కరీంనగర్ నగరంలోని వైశ్య భవన్ వద్ద గంప నారాయణ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైశ్య నిరుపేద భక్తుల కోసం ఏర్పాటు చేసిన అయోధ్య, కాశీ ఉచిత యాత్ర కార్యక్రమం ఆదివారం వైభవంగా ప్రారంభమైంది.

ఈ కార్యక్రమానికి మానకొండూర్ శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మరియు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని జెండా ఊపి యాత్రను ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గంప శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ యాత్ర మూడో సంవత్సరానికి చేరుకుందని అభినందించారు. వైశ్య నిరుపేద భక్తుల కోసం గంప శ్రీనివాస్ తన సొంత ఖర్చులతో ఈ యాత్రను ఏర్పాటు చేశారని.. సుమారు 8 రోజుల పాటు సాగే ఈ యాత్ర కోసం ప్రత్యేకంగా రెండు బస్సులను ఏర్పాటు చేసి, దాదాపు 45 కుటుంబాల సభ్యులను అయోధ్య, కాశీ క్షేత్రాలకు ఉచితంగా తీసుకెళ్తున్నారని తెలిపారు. యాత్రకు బయలుదేరిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసి, ఈ యాత్రను విజయవంతంగా కొనసాగిస్తున్నారని అన్నారు. అయోధ్య రాముడు మరియు కాశీ విశ్వేశ్వరుని ఆశీస్సులతో భక్తుల యాత్ర సుఖంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎన్నం ప్రకాష్, గాజ శివరాం, వైశ్య సంఘం ప్రతినిధులు, బిజెపి నాయకులు మరియు యాత్రకు బయలుదేరిన భక్తులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరుగా ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలి

**బిఆర్ఎస్ పార్టీ గుండెపూరి గ్రామ ఇన్‌చార్జ్, మండల నాయకుడు మెడిద మహేష్**



**తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి:** నల్గొండ - ఖమ్మం - వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ గుండెపూరి గ్రామ ఇన్‌చార్జ్, ప్రముఖ మండల నాయకుడు మెడిద మహేష్ పిలుపునిచ్చారు.

సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, విద్యావంతులు తమ హక్కును వినియోగించుకోవడానికి ఇదే సరైన సమయమని పేర్కొన్నారు.

అర్హత కలిగిన పట్టభద్రులు, డిప్లొమా పూర్తి చేసిన వారు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో 'ఫారం-18' పూరించి పేరు నమోదు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు సమయంలో నియోజకవర్గం, జిల్లా, వ్యక్తిగత వివరాలతో పాటు విద్యార్హత పత్రాలు, ఓటరు ఐడీ, ఆధార్, ఫోటోను అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం వచ్చే రశీదు సంఖ్యను భద్రపరుచుకోవాలన్నారు. విద్యావంతులైన పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఓటరుగా నమోదై ప్రజాస్వామ్య బలోపేతానికి భాగస్వాములు కావాలని మెడిద మహేష్ కోరారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
జాతీయ దినపత్రిక



## 31 గిన్నిస్ ప్రపంచ రికార్డులతో చరిత్ర సృష్టించిన గీతం పూర్వ విద్యార్థిని..






**పటాన్‌చెరు అక్షిత ప్రతినిధి:** గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయం, హైదరాబాదులోని స్కూల్ ఆఫ్ టెక్నాలజీ పూర్వ విద్యార్థిని శివాలి శ్రీవాస్తవ (2016-2020 బ్యాచ్) అసాధారణ ఘనతను సాధించింది. ఆమె మొత్తం 31 గిన్నిస్ ప్రపంచ రికార్డులను సాధించి ఒక అద్భుతమైన మైలురాయిని చేరుకున్నట్టు ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శివాలి, ఆమె తల్లిదండ్రులు కవితా శ్రీవాస్తవ, అనిల్ శ్రీవాస్తవలతో కలిసి మరో కొత్త గిన్నిస్ ప్రపంచ రికార్డు (చేతితో తయారు చేసిన మూడు వేల కాగితపు బొమ్మల అతిపెద్ద ప్రదర్శన కోసం)ను ఇటీవల అధికారికంగా అందుకున్నారు. దీంతో వారి కుటుంబం సాధించిన రికార్డుల సంఖ్య అపూర్వమైన 31కి చేరింది. ఈ ఘనతతో, భారతదేశంలో అత్యధిక గిన్నిస్ ప్రపంచ రికార్డులు కలిగిన వ్యక్తిగా శివాలి నిలిచారు. ఒరిగామి, పేపర్ ఆర్ట్ లో తన అసాధారణ ప్రతిభకు గుర్తింపు పొందిన శివాలి, సృజనాత్మకతను అంకితభావం, కచ్చితత్వం, పట్టుదలతో కూడిన ఒక అద్భుతమైన ప్రయాణంగా మలిచారు. ఆమె తన తల్లిదండ్రులతో కలిసి ఎంతో శ్రద్ధగా లక్షలాది కాగితపు కళాఖండాలను చేతితో రూపొందించి, వాటి కళాత్మక నైపుణ్యానికి ప్రపంచవ్యాప్త గుర్తింపును సంపాదించారు. శ్రీవాస్తవ కుటుంబానికి ఈ విజయాలు కేవలం రికార్డుల కన్నా ఎంతో ఎక్కువ. సహనం, కళాత్మక అభిరుచి, కఠోర శ్రమ, కుటుంబ సహకార బలానికి నిదర్శనంగా వారి ప్రయాణం నిలుస్తుంది. ఈ చారిత్రాత్మక విజయం సాధించినందుకు గీతం నాయకత్వం, అధ్యాపక బృందం, సిబ్బంది, విద్యార్థులు తదితరులు శివాలికి, ఆమె కుటుంబానికి హృనదయపూర్వక అభినందనలు తెలియజేశారు. కళ, ఆవిష్కరణ, సృజనాత్మకతల స్ఫూర్తిదాయక సమ్మేళనం ద్వారా భారతదేశానికి అంతర్జాతీయ గుర్తింపును తీసుకొస్తున్న ఆమె విజయాల పట్ల వర్సిటీ వర్గాలు ఎంతో గర్వపడుతున్నాయి. ఆమె మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

## లయన్స్ క్లబ్ వినాయక ఫ్రెండ్స్ సేవలకు అవార్డు ప్రదానం



**తొర్రూరు అక్షిత ప్రతినిధి:** సమాజ సేవే లక్ష్యంగా లయన్స్ క్లబ్ తొర్రూరు వినాయక ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా లయన్స్ భవన్ వరంగల్ వేదికగా జిల్లా గవర్నర్ లయన్ నరహరి సుధాకర్ రెడ్డి మరియు డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సభ్యుల సమక్షంలో క్లబ్ అధ్యక్షుడు లయన్ వనం మోహన్, కార్యదర్శి లయన్ పారిపల్లి శ్రావణ్ కుమార్, కోశాధికారి లయన్ దొడ్డ సిద్దూ లను ఘనంగా సన్మానించి అవార్డు ప్రదానం చేశారు.

క్లబ్ ఆధ్వర్యంలో ప్రజాసేవ, సామాజిక కార్యక్రమాలు, పేదలకు సహాయ సహకారాలు అందిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు ఈ గుర్తింపు లభించింది. ఈ అవార్డు క్లబ్ సభ్యుల్లో మరింత ఉత్సాహాన్ని నింపిందని, భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టి ప్రజలకు అండగా నిలుస్తామని క్లబ్ ప్రతినిధులు తెలిపారు.

ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారి జిల్లా గవర్నర్‌కు, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సభ్యులకు, రిజియన్ చైర్మన్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. క్లబ్ సభ్యుల సమిష్టి కృషి, సేవాభావమే ఈ గుర్తింపునకు కారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి ఉప జిల్లా గవర్నర్ లయన్ పుట్ట హరికిషన్ రెడ్డి, రెండవ ఉప జిల్లా గవర్నర్ లయన్ రమణ రెడ్డి, పూర్వ జిల్లా గవర్నర్లు లయన్ కన్నా పరుశురాం, లయన్ వెంకటేశ్వర రావు, +ూు కో ఆర్డినేటర్ లయన్ టీ. వెంకట్ రెడ్డి, రిజియన్ చైర్మన్ డా. నాగవాణి,క్లబ్ ఇమిడియట్ పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ తల్లాడి హిరదర్, జిల్లా బాద్యులు, రిజియన్ ఛైర్మెన్లు, జోన్ చైర్మన్లు మరియు లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

# రాజుపేటలో పోలీసుల విస్తృత తనిఖీలు

**భద్రాచలం, అక్షిత న్యూస్:** భద్రతా పరిరక్షణ, నేరాల నియంత్రణే లక్ష్యంగా భద్రాచలం పట్టణంలోని రాజుపేట కాలనీలో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. భద్రాచలం డీఎస్పీ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్డెన్ సెర్చ్ కార్యక్రమంలో వాహనాలను విస్తృతంగా తనిఖీ చేయడంతోపాటు సంబంధిత ధ్రువపత్రాలను పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచుతూ స్థానికులకు భద్రతపై అవగాహన కల్పించారు.



ఈ సందర్భంగా డీఎస్పీ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ, యువత చెడు వ్యసనాలకు, నేరప్రవృత్తికి దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా గంజాయి వంటి మాదకద్రవ్యాల



వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీయడంతో పాటు కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. గంజాయిని సేవించినా, విక్రయించినా, సరఫరా చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తించినా ప్రజలు అప్రమత్తమై సమాచారం అందించాలని సూచించారు... ప్రజల సహకారంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టగలమని ఆయన తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

### పత్రాలు లేని వాహనాలు స్వాధీనం

రాజపేట కాలనీలో తెల్లవారుజాము నుంచే పోలీసులు నిర్వహించిన తనిఖీల నేపథ్యంలో వాహనాలను పరిశీలించి సరైన గృహపత్రాలు లేని వాహనాలను స్వాధీనం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.. తప్పనిసరిగా తమ వాహనాలకు సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ అరుణకుమార్ హెచ్చరించారు..

ఈ తనిఖీల్లో భద్రాచలం పట్టణ సీఐ సట్ల రాజు, ఎస్ఐలు సతీష్, రామకృష్ణ, ట్రాఫిక్ ఎస్ఐ పడాల కేశవ్‌తోపాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కోనేరు ఆ క్రమంనా అవాస్తవం కమ్యూనిస్టులపై కావాలని రాజకీయ కుట్రలు



**తొర్రూర్ అక్షిత ప్రతినిధి:** తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామంలో వెంకటేశ్వర స్వామి దేవాలయ భూములు ప్రభుత్వ భూముల గూర్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకుల మీద తగు చర్యలు తీసుకోవాలని సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. అమ్మాపురం గ్రామంలోని దేవాలయ భూముల విషయంలో మరియు హైస్కూలు భవన నిర్మాణం చేసిన భూముల విషయంలో కాంగ్రెస్ నాయకులు అబద్ధపు ప్రచారాలు చేస్తూ, వ్యక్తుల మీద, పార్టీల మీద, చేసే దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నామని లిసిపిఐ పార్టీ మండల కార్యదర్శి బందు మహేందర్, ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు ఓమ బిక్షపతి,మండల సహాయ కార్యదర్శి గణపురం లక్ష్మణ్, సిపిఐ గ్రామ కార్యదర్శి బూరుగు యాదగిరిలి తదితరులు అమ్మాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తీవ్రంగా ఖండించారు.

ముఖ్యంగా అమ్మపురం గ్రామ స్కూలు భవన నిర్మాణం కోసం, 1984 సంవత్సర ప్రాంతాల్లో, అప్పటి గ్రామ సర్పంచిగా పనిచేసిన తమ్మెర విశ్వేశ్వరరావు దాదాపు ఎకరం స్థలాన్ని విరాళంగా ఇచ్చి, అప్పటి కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే రోజ్గార్ యోజన నిధులతో, పక్కా భవన నిర్మాణాలు చేపట్టడం జరిగింది. దాదాపు 42 సంవత్సరాల తర్వాత ఈ రోజున గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులుగా చలామణి అవుతున్న ముద్ద విక్రమ్ రెడ్డి తదితరులు ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడటం పద్ధతి కాదన్నారు. గత 40 సంవత్సరాలుగా సిపిఐ పార్టీ నాయకులు గ్రామ అభివృద్ధి కోసం ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ వస్తున్నారు. అటువంటి నాయకులపై పార్టీపై అబద్ధాలు ప్రచారం చేయటం కోసం, విక్రమ్ రెడ్డి స్కూలు భవనం సర్వే నెంబరు 4 లో లేదని అది సర్వే నెంబరు 5 లో ఉన్న భూమిని , అది ఎండోమెంట్ ల్యాండ్ అని టిఆర్ఎస్ నాయకులతో కుమ్మక్కై అబద్ధపు ప్రచారాలు చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. రాముల వారి గుట్టమీద ఉన్న కోనేరు గోడ కూలగొట్టి ప్లాట్లగా విక్రయం చేస్తున్నారని చెప్పడం జరిగింది.

అసలు కోనేరు గోడను కూలగొట్టిందే విక్రమ్ రెడ్డి ఎంపీటీసీగా ఉన్న సమయంలో, ఆనాటి సర్పంచ్ కడెం యాకయ్య. స్కూలు పిల్లలకి దుర్వాసన వస్తున్న సందర్భంగా దాన్ని కూలగొట్టి మొరం పోయించినట్టుగా అతనే చెప్తున్నాడు. కానీ కాంగ్రెస్ నాయకులు పచ్చకామెర్లు వచ్చిన వాడికి లోకమంతా పచ్చగా కనిపించినట్టు , వ్యక్తుల మీద, పార్టీల మీద దుష్ప్రచారం చేస్తున్నారని సిపిఐ నాయకులు ఈ సందర్భంగా మండిపడ్డారు.

అలాగే వెంకటేశ్వర స్వామి భూములు కూడా ప్లాట్లు చేసి విశ్వేశ్వరరావు అమ్ముకున్నాడని, వారి పార్టీ నాయకత్వానికి, ఎమ్మెల్యే గారికి ఫిర్యాదు చేయడం జరిగింది,కాబట్టి ఇకనైనా దుష్ప్రచారాలు మాని గ్రామ అభివృద్ధి కోసం పనిచేయండి. వ్యక్తిగత కక్షలతో గ్రామ ప్రజల మధ్య చిచ్చుపెట్టి , ప్రయోజనం పొందుదామని అనుకుంటే ప్రజలు తగిన బుద్ధి మీకు చెప్పక మానరు.ఇతరుల భూములను దొంగ రిజిస్ట్రేషన్లు చేసుకున్నటువంటి టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ, మీ ఎమ్మెల్యే గారిని, పార్టీ నాయకత్వాన్ని కూడా మీరు మోసం చేస్తున్న విషయం బహిరంగ రహస్యం. ఇప్పటికైనా మీ పార్టీ నిజా నిజాలు తెలుసుకొని ఈ గ్రామంలో వాస్తవాలను తెలుసుకోవాల్సిందిగా మీడియా ద్వారా కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని, స్థానిక ఎమ్మెల్యే గారిని కోరుతున్నాం. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు ఇటువంటి దుష్ప్రచారాన్ని మానుకొని గ్రామ అభివృద్ధి కోసం కృషి చేయాలని హితావు పలికారు

ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి పేరబోయిన కిరణ్ కుమార్, తొర్రూరు పట్టణ కార్యదర్శి ముద్రబోయిన వెంకన్న, కోటగిరి యకాంతం,సిపిఐ అమపురం గ్రామ వార్డు సభ్యులు యాకయ్య, కోటగిరి కృష్ణమూర్తి, గణపురం లక్ష్మణ్, వెంకటరామ్ నరసయ్య,వీరన్న,పంజాల పాపయ్య, కొమురయ్య, బొమ్మెరా ఎల్లయ్య, కూమర్. తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ల రాష్ట్రస్థాయి సమావేశం...





### కార్మికుల ఐక్యత, సంక్షేమం, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సంఘటితం ముందుకు సాగాలి

### కార్మికుల సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తాం.ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హామీ..

**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ల ఫెడరేషన్ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాన్ని ఆదివారం హనుమకొండ జిల్లా కాజీపేట 47వ డివిజన్ పరిధిలోని రైల్వే డీజిల్ కాలనీ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు.

ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పోగుల జాక్సన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 300 మంది ప్రతినిధులు కార్మికులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లు ఎదుర్కొంటున్న సమస్యలు, కార్మికుల సంక్షేమం, గృహ వసతి, స్థలాల కేటాయింపు తదితర అంశాలపై చర్చించారు.

ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు బట్టి శ్రీనివాస్, 62వ డివిజన్ మాజీ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, కాజీపేట మండల కార్మిక సంఘాల గౌరవ అధ్యక్షుడు మైసరాపు సిరిల్ లారెన్స్,తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల సమావేశానికి ప్రత్యక్షంగా హాజరు కాలేకపోయిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఫోన్ ద్వారా తన సందేశాన్ని అందించారు.

ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లు, ఇతర కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

**కార్మికుల సంక్షేమానికి సంబంధించి ఎమ్మెల్యే నాయిని**

కార్మికుల అవసరాల కోసం 250 గజాల స్థలాన్ని కేటాయించామని, దీనికి సంబంధించి మున్సిపల్ టెండర్ ప్రక్రియ కూడా పూర్తయిందని తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకున్నట్లు నాయకులు వెల్లడించారు.

ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి బాలస్వామి, కాజీపేట మండల ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ల సంఘం ప్రధాన కార్యదర్శి జాతి భాస్కర్, కోశాధికారి జె. కుమారస్వామి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# బీసీ సబ్‌ప్లాన్‌కు ప్రత్యేక చట్టం తీసుకురావాలి!

### జనాభా దామాషా ప్రకారం బీసీలకు నిధులు కేటాయించాలి!

### బీసీ సమాజ్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం..




**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** బీసీల సమగ్ర అభివృద్ధి, ఆర్థిక సాధికారత, విద్యా, ఉపాధి అవకాశాల కల్పన కోసం బీసీ సబ్‌ప్లాన్‌కు ప్రత్యేక చట్టం తీసుకురావాలని, బీసీ జనాభా దామాషా ప్రకారం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని బీసీ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలుగురు బీసీ సంఘ నాయకులు డిమాండ్ చేశారు ఆదివారం ప్రెస్ క్లబ్ మెట్టుగడ్డ లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో బీసీలు గణనీయమైన సంఖ్యలో ఉన్నప్పటికీ, వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి అవసరమైన నిధులు జనాభా నిష్పత్తికి అనుగుణంగా కేటాయించబడేలా చట్టబద్ధమైన వ్యవస్థ ఉండాలని కోరుతూ బీసీ సబ్‌ప్లాన్‌కు ప్రత్యేక చట్టం తీసుకువచ్చి, నిధుల కేటాయింపుకు చట్టబద్ధమైన హామీ కల్పించాలని బీసీ జనాభా దామాషా ప్రకారం రాష్ట్ర బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని కేటాయించిన నిధులు ఇతర పథకాలకు మళ్లించకుండా పటిష్టమైన చట్టపరమైన నిబంధనలు రూపొందించాలన్నారు..

వివిధ కుల సంఘాల నాయకులు మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధి, స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత, వృత్తిదారుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రతి శాఖలో బీసీల కోసం కేటాయించిన నిధులు, వాటి ఖర్చుల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలనీ కోరారు.బీసీల అభివృద్ధికి చట్టబద్ధమైన నిధుల వ్యవస్థ అవసరం అని బీసీల అభివృద్ధి కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, నిర్దిష్ట బడ్జెట్ కేటాయింపులు, పారదర్శకమైన నిధుల వినియోగం, నిరంతర పర్యవేక్షణతో కూడిన చట్టబద్ధమైన వ్యవస్థ ద్వారా సాధ్యమవుతుందని సమావేశం పేర్కొంది. ప్రభుత్వం ఈ డిమాండ్లపై సానుకూలంగా స్పందించి, బీసీ సబ్‌ప్లాన్‌కు ప్రత్యేక చట్టం రూపొందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని సమావేశం డిమాండ్ చేసింది. బీసీలకు జనాభా దామాషా ప్రకారం నిధుల కేటాయింపు జరిగేలా బీసీ సంఘాలన్నీ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చింది.

ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొదల శ్రీనివాస్ సాగర్, బీసీ సమాజ్ గౌరవ అధ్యక్షుడు శివార్చక విజయ కుమార్, బీసీ సమాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయరాజు, తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జుర్రు నారాయణ యాదవ్, బీసీ జేఏసీ నాయకులు సారంగి లక్ష్మి కాంత్, బెక్కం జనార్ధన్, కుమ్మరి సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు బుగ్గన్న, జాండ్ర సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు మహేందర్,బీసీ సమాజ్ యూత్ ప్రెసిడెంట్ పాలమూరు వెంకటేష్ గౌడ్, బీసీ సమాజ్ పట్టణ అధ్యక్షుడు నరసింహ, నాయకులు బాను ప్రకాష్, మెట్టుకాడి.ప్రభాకర్, వివిధ కుల సంఘ నాయకులు రాజ్ కుమార్, మేదరి ఆంజనేయులు, భీంపల్లి శ్రీకాంత్, నడిమింటి శ్రీనివాసులు, పాండురంగం యాదవ్, పిల్లి సూర్యనారాయణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## దసరా ర్యాలీలో... తల్వార్‌తో సంచరించిన వ్యక్తిపై కేసు



**ఇచ్చోడ అక్షిత న్యూస్:** దసరా పండుగ ర్యాలీలో తల్వార్‌తో సంచరిస్తూ ప్రజల్లో భయాందోళనలు కలి గించే విధంగా వ్యవహరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి ఆదివారం అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఇచ్చోడ మండలం ధాబా-బి గ్రామానికి చెందిన టేకులే గణపతి (23) ఈ నెల 20వ తేదీన దసరా పండుగ ర్యాలీలో చేతిలో తల్వార్ పట్టు కొని సంచరిస్తున్నట్లు సమాచారం అందింది. గ్రామ పోలీసు అధికారి విధుల్లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ రామ్ రెడ్డి సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకుని పరి శీలించారు. తల్వార్‌తో ర్యాలీలో పాల్గొంటున్నట్లు విచారణలో వెల్లడైందని ఎస్ఐ పేర్కొన్నారు. ఆయు ధాల చట్టంలోని సెక్షన్ 27(1) ప్రకారం కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రజా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఆయుధాలతో సంచరించరాదనీ, ఎవరైనా పండు గలు, ఉత్స వాల సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఇచ్చోడ ఎస్ఐ హెచ్చరించారు.

## రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యుడిగా శిగ వీరస్వామి గౌడ్ నియామకం



**రంగారెడ్డి జిల్లా:** భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడిగా శిగ వీరస్వామి గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శిగ వీరస్వామి గౌడ్ మాట్లాడుతూ, తనకు ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామ చందర్ రావు, భువనగిరి మాజీ ఎంపీ, తెలంగాణ రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుళ్ళ వీరేందర్ గౌడ్, జిల్లా అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొత్త అశోక్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ ఎలగని నారాయణ యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మధుకర్ రెడ్డి, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్ రెడ్డి, కొంగరకలాన్ డివిజన్ అధ్యక్షులు గజ్జల నరసింహారెడ్డి, ఆదిపట్ల డివిజన్ అధ్యక్షులు కోరే శివకుమార్, బీజేవైఎం యువ నాయకుడు వినయ్ కుమార్, సాయి గౌడ్, పలువురు డివిజన్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భీమనబోయిన లింగయ్య మృతి బాధాకరం పోటు అశోక్ కుమార్



**అక్షితన్యూస్ మునగాల:** జగన్నాధపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు భీమనబోయిన లింగయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మరణించారు

ఈరోజు జగన్నాధపురం గ్రామంలో వారి పార్థివదేహంపై కాంగ్రెస్ పార్టీ జెండా కప్పి, పూలదండ వేసి నివాళులర్పించిన మునగాల మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోటు అశోక్ కుమార్ మరియు మండల నాయకులు నలమాద మల్సూర్ వారి వెంట పొన్నం వెంకటరమణి. వెంకటేష్ మరియు జగన్నాధపురం గ్రామకాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరుగా ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలి

## ఎన్కెపల్లి గ్రామ సర్పంచ్ తూంపల్లి దయాకర్




పూడూర్,అక్షిత ప్రతినిధి: రంగా రెడ్డి – హైదరాబాద్ – మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని పూడూర్ మండలం ఎన్కెపల్లి గ్రామ సర్పంచ్ తూంపల్లి దయాకర్ పిలుపునిచ్చారు.

వికారాబాద్ జిల్లా పూడూర్ మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, విద్యావంతులు తమ హక్కును వినియోగించు కోవడానికి ఇదే సరైన సమయమని పేర్కొన్నారు.

అర్హత కలిగిన పట్టభద్రులు, డిప్లొమా పూర్తి చేసిన వారు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో 'ఫారం-18' పూరించి పేరు నమోదు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు సమయంలో నియోజకవర్గం, జిల్లా, వ్యక్తిగత వివరాలతో పాటు విద్యార్హత పత్రాలు, ఓటరు ఐడీ, ఆధార్, ఫోటోను అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం వచ్చే రశీదు సంఖ్యను భద్రపరుచుకోవాలన్నారు. విద్యావంతులైన పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఓటరుగా నమోదై ప్రజాస్వామ్య బలోపేతానికి భాగస్వాములు కావాలని తూంపల్లి దయాకర్ కోరారు.

# మహాదేవపూర్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పర్యటన

## 1వ వార్డు మెంబర్‌ను పరామర్శించిన కోట రాజబాబు



మహాదేవపూర్,మంథని, అక్షిత ప్రతినిధి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహ దేవపూర్ మండల కేంద్రంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని 1వ వార్డు మెంబర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా పరామర్శించారు. నేరుగా వార్డు మెంబర్ నివాసానికి వెళ్లిన చైర్మన్ రాజబాబు, వారి కుటుంబ సభ్యులతో సమావేశ మయ్యారు. అందరి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న ఆయన, తాము ఎల్లప్పుడూ కుటుంబానికి అండగా ఉంటామని ఈ సందర్భంగా గట్టి భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎం.ఏ. నగర్ కాలనీలో బీఆర్ఎస్ నాయకులు రామప్రభు పర్యటన



మియాపూర్ అక్షిత ప్రతినిధి: ఎం.ఏ. నగర్ కాలనీలో బీఆర్ఎస్ నాయకులు రామప్రభు పర్యటించి, స్థానిక సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై కాలనీ పెద్దలు, ప్రజలు, యువతతో చర్చించారు. ఈసందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను స్వయంగా పరిశీలించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో భిక్షపతి,శేఖర్, రవీందర్, భీంరాజ్, సుమో రాజు, శ్రీశైలం, శ్రీను, అనిల్, అల్లావుద్దీన్, నరసింహ, శరత్, సంతోష్, వెంకటేష్, వేణుగోపాల్, గణేష్, మూర్తి, దశరథ్, రాములు, జగన్, మోహన్, మహేష్, శివ, చంద్రయ్య, లక్ష్మీ ల తో పాటు ఏఆర్‌పీ టీమ్ సభ్యులు,కాలనీ పెద్దలు, యువత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.కాలనీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేస్తామని నాయకులు తెలిపారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్‌ది

# అనవసర రాద్ధాంతం



### ఎస్ ఐ ఆర్ పై కాంగ్రెస్ వైఖరిని నిరసిస్తూ నవంబర్ 3న కరీంనగర్‌లో తలపెట్టిన ర్యాలీని విజయవంతం చేయండి

### బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం

కరీంనగర్ అక్షిత బ్యూరో: కేంద్ర ఎన్నికల సంఘం పారదర్శకంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియపై కాంగ్రెస్, అనవసర రాద్ధాంతం, గందరగోళం సృష్టించి పనికిమాలిన రాజకీయం చేస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.బీజేపీ ఇల్లంతకుంట మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన టిఫిన్ బైటక్ , ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమానికి సాయిని మల్లేశం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా కాంగ్రెస్ తన రాజకీయ ప్రయోజనాల కోసం భారత ఎన్నికల సంఘం, బీజేపీ మోదీ ప్రభుత్వం పై చేస్తున్న అసత్య ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు.ఓటర్ల జాబితాను పూర్తి పారదర్శకంగా, జవాబుదారీతనంతో నకిలీ ఓట్లు తొలగించి అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే 'ఎస్ ఐ ఆర్' ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఎస్ ఐ ఆర్ పై అనవసర రాద్ధాంతం చేయడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్, సిజెపి వైఖరి పట్ల ఆయన తీవ్రంగా మండిపడ్డారు. నకిలీ ఓట్లు, మరణించిన వారి ఓట్లు తొలగించవద్దని ఆయన ప్రశ్నించారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం ఇదేమి ప్రథమం కాదని, భారత ఎన్నికల సంఘం గతంలో 1952, 1957, 1961, 1965-66, 1983-84, 1987-89, 1992-95, 2002-2004 లలో ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియను నిర్వహించిందని గుర్తు చేశారు.సుదీర్ఘ విరామం తరువాత 2025 మరియు 2026 లలో దేశవ్యాప్తంగా వివిధ దశల్లో ఈ సర్వేను నిర్వహిస్తుందన్నారు. అయితే ప్రతిపక్ష పార్టీలు ఓటర్లలో గందరగోళం సృష్టించి ఓటు బ్యాంకు రాజకీయాలు చేయాలని చూస్తున్నాయని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని బలపేతం చేసేందుకు స్పష్టమైన ఓటర్ల జాబితాను తయారు చేసేందుకు చేపట్టిన ఈ ప్రక్రియను రాజకీయం చేయడం సరికాదన్నారు. బీజేపీ ఓట్ చోరీ చేస్తుందని మాట్లాడుతున్న కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఓట్ చోరీతోనే గెలిచిందా, 50 ఏళ్ల దేశాన్ని పాలించిందా, అనే విషయాన్ని స్పష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలను గందరగోళానికి గురిచేసి రాజకీయ లబ్ది పొందాలనే ఏకైక ఎజెండాతో కాంగ్రెస్ దేశ వ్యతిరేక శక్తులతో కలిసి పనిచేస్తుందని ఆయన ఆరోపించారు.పూర్తి పారదర్శకతతో జరుగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలంతా గ్రహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల కాలంలోఢిల్లీ కేంద్రంగా ఆందోళనలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ, సిజెపిలు ఈ విషయంలో చేస్తున్న తప్పులను, ప్రచారాలను, వైఖరిని విడనాడాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ పై కాంగ్రెస్ అవలంబిస్తున్న వైఖరి ఎండగడుతూ నవంబర్ 3న కరీంనగర్లో భారీ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున యువతను భాగస్వామ్యం చేయడం జరుగుతుందని , ర్యాలీని విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు తగిన కృషి చేయాలని పిలుపునిచ్చారు. 3న కరీంనగర్లో ర్యాలీకి బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ హాజరవుతారని తెలిపారు. టిఫిన్ బైటక్ సమావేశం అనంతరం ప్రధాని మోదీ మన్ కీ బాత్ ను స్థానిక బిజెపి శ్రేణులతో కలిసి సాయిని మల్లేశం వీక్షించారు.

## మియాపూర్‌లో ఘనంగా మన్ కీ బాత్ వీక్షణ,

# పట్టభద్రుల ఓటర్ల నమోదు అవగాహన కార్యక్రమాలు..

### పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు, రాష్ట్ర ఇంచార్జి రేఖాశర్మ

మియాపూర్ అక్షిత ప్రతినిధి: మియాపూర్ డివిజన్ విడియా కాలనీ లోని బీజేపీ నాయకులు సమ్మెట ప్రసాద్ నివాసంలో నిర్వహించిన పట్టభద్రుల ఓటరు నమోదు అవగాహన ప్రత్యేక సమావేశం,మయూరి నగర్ డివిజన్ పరిధిలోని లక్ష్మీ ఇంపీరియల్ గేటెడ్ కమ్యూనిటీ ప్రాంగణంలో శేరిలింగంపల్లి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో 139వ 'మన్ కీ బాత్' కార్యక్రమంతో పాటు పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల నమోదు ప్రక్రియపై అవగాహన సదస్సు కార్యక్రమాలలో ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు, రాష్ట్ర ఇంచార్జ్ రేఖా శర్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతం రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి , శేరిలింగంపల్లి ఇంచార్జ్ రవికుమార్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు హాజరై మన్ కీ బాత్ వీక్షించి పట్టభద్రుల కు దిశానిర్దేశం చేశారు,రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు మాట్లాడుతూ



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న 'మన్ కీ బాత్' 139వ ఎపిసోడ్‌కు చేరుకోవడం హర్షణీయం. విద్యావంతులైన పట్టభద్రులు తమ ప్రజాస్వామ్య హక్కును గుర్తించి వెంటనే ఓటరుగా నమోదు చేసుకోవాలని, దేశ భవిష్యత్తుకు ఇది కీలకమని పిలుపునిచ్చారు.

రాష్ట్ర సహాయ ఇన్‌ఛార్ రేఖా శర్మ మాట్లాడుతూ ఓటర్ల నమోదులో యువత, విద్యావంతులు చూపుతున్న ఆసక్తి అభినందనీయం. రాబోయే ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించేలా నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో కృషి చేయాలని కోరారు. గౌతం రావు మాట్లాడుతూ

రాబోయే పట్టభద్రుల మరియు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలి. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ప్రతి బూత్ స్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ పట్టభద్రుల ఓటర్ల నమోదు వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు, పార్టీఅభివృద్ధికి ,బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్న ప్రతి నాయకుడు, నాయకురాళ్ళు, కార్యకర్తల శ్రమను పార్టీ గుర్తిస్తుందని, ప్రతి కార్యక్రమాలు ఎంత ముఖ్యమో స్థానిక సమస్యలపరిష్కారానికి , ప్రజలతో మమేకమై పని చేయడం కూడా అంతే ముఖ్యమన్నారు,ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి , రవీందర్ రావు ,కసిరెడ్డి భాస్కర్ రెడ్డి ,నాగులు గౌడ్ , సమ్మెటప్రసాద్ ,సీతారామరాజు,గణేష్ ముదిరాజ్ , లక్ష్మణ్, కృష్ణ రాష్ట్ర , గోపాల్ రావు, ఆంజనేయులు సాగర్, మహేష్ యాదవ్, పద్మ, కాంచన కృష్ణ, శ్రీనివాస్, రాజేష్ గౌడ్, మరియు జిల్లా, నియోజకవర్గ, డివిజన్ నాయకులు, పదాధికారులు, వివిధ మోర్చల నాయకులు, పదాధికారులు, కార్యకర్తలు, స్థానిక ప్రతినిధులు, కాలనీవాసులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# నువ్వు 1000 మందితో వస్తే నేను 50 వేల మందితో వస్తా

**వయసుకు తగ్గ మాటలు మాట్లాడాలి**

**నీ అహంకారానికి ప్రజలు బుద్ధి చెప్పి ఇంటికి పంపారు**

**వనపర్తి ప్రజలు విజ్ఞులు అన్ని గమనిస్తున్నారు**

**విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డిపై విరుచుకుపడ్డ ఎమ్మెల్యే మేఘారెడ్డి**



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** అహంకార పూరిత పాలన మాకు వద్దని, ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టలేమని నీ గర్వాన్ని అణిచివేసి గద్దె దింపి ఇంట్లో కూర్చోబెట్టిన నేటికీ నీ తీరు మారకపోవడాన్నీ వనపర్తి వనపర్తి ప్రజలు విజ్ఞులు మేధావులు గమనిస్తున్నారని రానున్న కాలంలోనూ నీకు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబర్ 30న ప్రజాక్షేత్రంలో ఓటమిపాలైన ఓ మాజీమంత్రి తెలంగాణ రాష్ట్రంలోనే నెంబర్ ఫోర్ అని చెప్పుకునే వ్యక్తి వయసుకు తగ్గిన మాటలు మాట్లాడాలని ఏడు పదుల వయసులో మీరు వెయ్యి మందితో వస్తే మేము 50 వేల మందితో వస్తామని దేనికైనా సిద్ధమని ఎమ్మెల్యే ఘాటు హెచ్చరిక చేశారు. 32 మంది బీసీ నాయకులపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టించారని, విలేకరులను సైతం వదలకుండా అట్రాసిటీ కేసులు నమోదు చేసిన రోజులను ప్రజలు మర్చిపోలేదన్నారు. నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, నిరుద్యోగులు, వివిధ వర్గాల ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన పాలనకు ప్రజలు చరమగీతం పాడారని వ్యాఖ్యానించారు. గత పాలనలో ఎదురైన పరిస్థితులను దృష్టిలో పెట్టుకునే ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టారని మేఘారెడ్డి అన్నారు. నవంబర్ 30న జరిగిన ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజల తీర్పును గౌరవించాలని సూచించారు. జీవితంలో ఒక్కసారే ఎమ్మెల్యే అయ్యారంటూ నిరంజన్‌రెడ్డిని ఎద్దేవా చేశారు. నాగర్‌కర్నూల్‌లో పుట్టి, కొల్లాపూర్‌లో పెరిగి, వనపర్తిలో రాజకీయ ఆధిపత్యం చెలాయిస్తామంటే కుదరదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్ల కాలంలో ఏం చేసిందో, కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లలో ఏం చేస్తుందో ప్రజల సమక్షంలో చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని మేఘారెడ్డి సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పాలనకు సంబంధించిన పత్రాలు తీసుకొచ్చి చర్చకు రావాలని, తాను ఎలాంటి పత్రాలు లేకుండానే చర్చించేందుకు సిద్ధమని అన్నారు. అభివృద్ధి విషయంలో ఎవరి పాలన ఎలా ఉందో ప్రజలే నిర్ణయిస్తారని పేర్కొన్నారు. వెయ్యి మందితో కలిసి నడిబజారులో చెప్పుతో కొడతానంటూ మాట్లాడటం ఏ విధమైన రాజకీయ సంస్కృతికి నిదర్శనమని ప్రశ్నించారు. వయసులో పెద్దవారైనా మాటతీరు, ప్రవర్తనలో హుందాతనం ఉండాలని హితవు పలికారు. ప్రజాస్వామ్యంలో బెదిరింపులకు, అహంకారపూరిత వ్యాఖ్యలకు స్థానం లేదన్నారు. వనపర్తి విద్యావంతులు, విజ్ఞులు, మేధావులు, రాజకీయ విశ్లేషకులు ఈ పరిణామాలను గమనించి ఆలోచించాలని కోరారు. అహంకారంతో వ్యవహరించే నాయకుడు కావాలా, ప్రజలకు సేవ చేసే నాయకుడు కావాలా అన్నది ప్రజలే నిర్ణయించాలని అన్నారు. ఎంతమందితో వచ్చినా ఎదుర్కొనేందుకు తాను సిద్ధంగా ఉన్నానంటూ మేఘారెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో నిరంజన్‌రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ టికెట్ రావడం కూడా అనుమానమేనని, ఒకవేళ టికెట్ వచ్చినా ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు. వనపర్తి రాజకీయాల్లో బెదిరింపులు, వ్యక్తిగత దూషణల కంటే అభివృద్ధి, ప్రజాసేవే ముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా డిసిసి అధ్యక్షులు శివసేనారెడ్డి, జిల్లా పార్టీ కార్యవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్‌లో పట్టభద్రుల ఓటర్ నమోదు కార్యక్రమం

**పట్టభద్రులు మత ఓటును నమోదు చేసుకోవాలి**

**గ్రంథాలయ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్**



**మేడ్చల్, అక్షిత ప్రతినిధి:** పట్టభద్రులు ప్రతి ఒక్కరూ ఓటును నమోదు చేసుకోవాలని మేడ్చల్ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్ సూచించారు. త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ డివిజన్ లోని గ్రంథాలయ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టభద్రుల ఓటు హక్కు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆదేశాల మేరకు మేడ్చల్ పట్టణంలో పట్టభద్రుల ఓటర్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి పట్టభద్రుల నుండి మంచి స్పందన లభించిందని ఆయన తెలిపారు. అర్హులైన వారు తమ ఓటు ను నమోదు చేసుకోవాలని భాస్కర్ యాదవ్ సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి విష్ణు చారి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మల్లికార్జున స్వామి, మేడ్చల్ మున్సిపల్ మాజీ కో ఆప్షన్ సభ్యులు ఆకిటి నవీన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పత్తి చేనులో అంతర పంటగా గంజాయి సాగు..

**బోథ్‌లో వేర్వేరు కేసులు నమోదు**

**33 గంజాయి మొక్కలు స్వాధీనం**

**ఇద్దరు నిందితులు అరెస్ట్**



**అదిలాబాద్/ఇచ్చోడ అక్షిత న్యూస్:** పత్తి చేనులో అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్న వేర్వేరు ఘటనల్లో ఇద్దరు నిందితు లపై ఆదివారం కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి తెలిపారు. బోథ్ మండలం పట్నా పూర్ గ్రామ శివా రులోని వ్యవసాయ భూముల్లో పత్తి పంట మధ్య అంతర పంటగా అక్ర మంగా గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం అందింది. బోథ్ ఎస్ఐ వి. పురుషోత్తం సిబ్బందితో కలిసి పట్నాపూర్ గ్రామ శివారులోని వ్యవసాయ భూమిలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో పత్తి చేనులో గంజాయి మొక్క లు సాగు చేస్తున్న నిందితుడు రాములు కొమ్రంను గుర్తించారు. 17 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నా మని, వీటి విలువ రూ. 1,70,000 ఉంటుందన్నారు. గుడిహత్నూర్ మండలం తాకిగూడ గ్రామానికి చెందిన సిడం చిత్రు పట్నాపూర్ గ్రామంలో దగ్గరి బంధువు వద్ద పొలం ను కౌలు కు తీసుకుని సాగు చేస్తున్నట్లు విచారణలో వెల్లడైందని డీఎస్పీ చెప్పారు. నిందితుడు సిడం చిత్రు పొలంలో 16 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ.. 1,60,000 ఉంటుందని చెప్పారు.

గంజాయి సాగు చేయడం, వినియోగించడం, విక్రయిం చడం, అక్రమ రవాణాకు పాల్పడటం చట్టరీత్యా నేర మన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఎవరైనా గంజాయి సాగు చేస్తున్నట్లు లేదా విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంటే పోలీసులకు తెలి యజేయాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ కార్యకలాపాలపై జిల్లా పోలీసు శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తుందని, చట్టవిరుద్ధ కార్య కలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుం టామని డీఎస్పీ హెచ్చరించారు.

# నగరాభివృద్ధికి పెద్దపీట వేస్తాం

**మేయర్ కొలగాని శ్రీనివాస్**



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తూ దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. నగరంలోని 2 వ డివిజన్ సరస్వతినగర్‌లో యూడీఐఎఫ్ నిధులు రూ. 40.70 లక్షలతో చేపట్టనున్న ఆర్ సీసీ పైపులైన్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమీ పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం డివిజన్ వాసులు మేయర్‌కు ఘనస్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాలతో సత్కరించారు. అభివృద్ధి నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం 8 వ డివిజన్ అలుగునూరులో మేయర్ పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. వరంగల్ రోడ్డుతో పాటు హైదరాబాద్ చేపలకాలనీ ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ కాల్వ మల్లేషంతో కలిసి స్థానిక ప్రజల అవసరాల కోసం వారసంతను ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద నిర్మాణం, బస్సు షెల్టర్లను ప్రారంభంచేశారు. ఈ సంధర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిదిలోని 66 డివిజన్ల లో యూసిఎఫ్ కు చెందిన 50 కోట్ల నిధులతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీస్కుంటున్నట్లు తెలిపారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా కాంట్రాక్టర్లు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రాధాన్యమిస్తున్నట్లు పేర్కొన్నారు.

స్థానిక ప్రజలకు అవసరమైన వస్తువులు అందుబాటులో ఉండటంతో పాటు, చిన్న వ్యాపారులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఈ మార్కెట్లు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఎస్సీ కమ్యూనిటీలకు అవసరమైన తాగునీటి సదుపాయాల కల్పనలో భాగంగా అలుగునూరులో బోర్‌వెల్స్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించినట్లు తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సహకారంతో మంజూరైన బోర్‌వెల్స్ పనులను చేపడుతున్నట్లు వివరించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రానున్న వేసవిని, ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని నగర ప్రజలు ఇప్పటి నుంచే నీటిని పొదుపుగా వినియోగించాలని మేయర్ విజ్ఞప్తి చేశారు. అవసరమైన మేరకే నీటిని వాడుకోవాలని, వృథాను అరికట్టాలని సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని కోరారు. భవిష్యత్తులో నీటి కొరత తలెత్తకుండా ప్రజలంతా బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి, ప్రజారోగ్యానికి హానికరమని మేయర్ పేర్కొన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల పర్యావరణ కాలుష్యం పెరుగుతోందని, వాటి వినియోగాన్ని తగ్గించి ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలని సూచించారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. నగరాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం విషయంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వేసవి నీటి ఎద్దడి నివారణకు సర్పంచ్ ఈడెం రాధా శ్రీనివాస్ ముందడుగు

**వెల్లంకిలో నూతన బోరుబావి.. మూడు ఇంచుల నీటి లభ్యత**



రామన్నపేట, అక్షిత ప్రతినిధి: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా వెల్లంకి సర్పంచ్ ఈడెం రాధా శ్రీనివాస్ ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామంలోని శివాలయం పక్కన నూతన బోరుబావిని తవ్వించారు. బోరులో మూడు ఇంచుల నీరు లభించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. రాబోయే వేసవిలో నీటి కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని ముందుగానే నీటి వనరులను అందుబాటు లోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా గ్రామంలో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జువ్వగోని మల్లమ్మ, వనం సత్తయ్య, తాటిపాముల శ్రీను, తాటిపాముల నరసింహ, బలికే లక్ష్మయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

**అర్హులైన పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పున్న జగన్మోహన్**



రామన్నపేట, అక్షిత ప్రతినిధి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పున్న జగన్మోహన్ కోరారు. 2023 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు.

సోమవారం రామన్నపేటలోని స్థానిక జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన ఓటు నమోదు కార్యక్రమంలో అర్హులైన పట్టభద్రులు పాల్గొని తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జగన్మోహన్ పేర్కొన్నారు.

## గర్భిణీలకు సామూహిక శ్రీమంతం



మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి : మిర్యాలగూడ పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీ భగవాన్ శ్రీ సత్య సాయి బాబా సాయి మందిరంలో ఆదివారం 10 మంది గర్భిణీలకు సామూహిక శ్రీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని శ్రీమంతం చేసుకున్న మాతృమూర్తులకు స్వామి అనుగ్రహ ప్రేమను, ఆశీస్సులను వాళ్ళకు మనస్ఫూర్తిగా అంద జేయాలని ప్రార్థించారు. కార్యక్రమంలో నల్గొండ జిల్లా నుంచి డీవీరెడ్డి, సత్యనారాయణ, శ్రీధర్ మిర్యాలగూడ సమితి సిహెచ్. ఆదినారాయణ గుప్తా, అభ్యు, రేవతి, సరిత పాల్గొన్నారు

# ఢిల్లీలో తలపెట్టబోయే 'ఓట్ బచావో - దేశ్ బచావో' సభను విజయవంతం చేయాలి

**ఏఐసీసీ పరిశీలకులు రాంభూపాల్ రెడ్డి**

**ఎన్నికల వ్యవస్థపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలి**

**కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి**




సూర్యాపేట , అక్షిత బ్యూరో : దేశ రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా దేశ వ్యాప్తంగా 'ఓట్ బచావో -- దేశ్ బచావో' కార్యక్రమాన్ని తలపెట్టబోతున్నట్లు ఏఐసీసీ పరిశీల కులు రాం భూపాల్ రెడ్డి వెల్లడించారు. అందుకు నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఇండియా కూటమి పార్టీలతో కలిసి భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇట్టి సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఓట్ బచావో -- దేశ్ బచావో' కార్యక్రమంలో భాగంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య అధ్యక్షతన ఆదివారం సూర్యాపేట డీసీసీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైనదని, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా పారదర్శకమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత వ్యవస్థలపై ఉందన్నారు. ఎన్నికల వ్యవస్థపై వ్యక్తమవుతున్న అనుమానాలపై వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఖమ్మం - వరంగల్ - నల్లగొండ జిల్లాల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల వ్యవస్థపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సుమారు 100 ఏళ్ల క్రితం నాటి సైమన్ కమిషన్‌తో ప్రస్తుత పరిస్థితులను పోలుస్తూ ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రక్రియపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర,నిష్పాక్షిక విచారణ జరగాలని,కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, సుప్రీంకోర్టు ఈ అంశంపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఓట్ బచావో -- దేశ్ బచావో' నినాదంతో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని సర్వోత్తమ్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో

వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ గుంజ రేణుక,రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోతు భాస్కర్,వ్యవసాయ,రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వెలుగు వెంకన్న, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, సూర్యాపేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డి, ధరావత్ వీరన్న నాయక్, ముస్కు రాంచంద్రరెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వేములపల్లి వాసుదేవరావు,జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం,జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ,ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ,ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యబద్ధంగా చేస్తున్న రిలే దీక్షలను పట్టించుకోని ఐ. టి..డి. ఏ .. పి ఓ..

**సొందే వీరయ్య. ఆరోపణ**



భద్రాచలం అక్షిత న్యూస్ : భద్రాచలం ఐటిడిఏ ధర్నా చౌక్ లో గత 15 రోజులుగా గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో చేపడుతున్న దీక్షలు ఆదివారం నాటికి 15 రోజులు చేరుకున్నాయి. దీర్ఘకాలికంగా ఉన్నటువంటి భూ సమస్యలను, ఐటీడీఏ ఎదురుగా ఉన్న సర్వే నెంబర్ 83లో గల ప్రభుత్వ భూమి సుమారు 7ఎకరముల భూమి అన్యాక్రాంతంపై భద్రాచలం సబ్ కలెక్టర్ నిగ్గు తేల్చాలని. గతంలో పనిచేసిన ఐటిడిఏ పిఓలు ఆదివాసి సంఘాలు ఇచ్చిన ఫిర్యాదులను గౌరవించి పనిచేశారని.. భద్రాచలం నడిబొడ్డున ఎల్ టి ఆర్ 1/70 చట్ట . ఉల్లంఘన జరుగుతుంటే సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారని ఉభయ రాష్ట్రాల జి. ఎస్. పి..కన్వీనర్ సొందే వీరయ్య ఘాటుగా విమర్శించారు . షెడ్యూలు ప్రాంతాలలో ఆదివాసి యువత ఉద్యోగ నియామకాలు లేక నిరుద్యోగులుగా కొట్టుమిట్టాడుతున్నారని. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఈ ప్రాంతంలో ఉన్నటువంటి వనరులను ప్రభుత్వం లూటీ చేస్తుంది తప్ప .. ఆదివాసుల జీవన పరిణామాలను దృష్టిలో పెట్టుకోవడం లేదని విమర్శించారు. భద్రాచలం కేంద్రంగా ఒక న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని గత కొంతకాలం నుండి గొండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఉద్యమాలు రిలే నిరాహార దీక్షలు పాదయాత్రలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వంలో ఇ సుమంతైనా కనికరం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.. ఈ యొక్క కార్యక్రమంలో పాయం సన్యాసి.. సోడి వెంకటేశ్వర్లు . ముక్తి జనార్దన్ రావు . కల్లూరి కృష్ణ.. కొమరం వెంకటేశ్వర్లు.. కొమరం భద్రమ్మ.. మడకం చిట్టమ్మ.. కుంజా సాయమ్మ.. వేల్పుల చిట్టమ్మ.. సున్నం సీతమ్మ.. తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు

**మేడ్చల్ - రైలాపూర్ రోడ్డు విస్తరణకు రూ.6 కోట్లు**

**అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.7.40 కోట్లు మంజూరు**

**ఎంపీ ఈటల ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన బీజేపీ నాయకులు**



మేడ్చల్, అక్షిత ప్రతినిధి: రోడ్ల అభివృద్ధికి మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ భారీగా నిధులు మంజూరు చేయించారు. మేడ్చల్ లోని అండర్ గ్రౌండ్ బ్రిడ్జ్ నుంచి రైలాపూర్ వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు రూ.6 కోట్లు మంజూరు కాగా రైలాపూర్ -- గౌడవెల్లి బ్రిడ్జి నిర్మాణానికి హెచ్ఎండిఏ ద్వారా రూ.7.40 కోట్లు మంజూరు చేయించడం జరిగింది. రోడ్ల అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేసిన మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ ను తన నివాసం లో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ డివిజన్ బీజేపీ అధ్యక్షురాలు శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో గిర్మాపూర్, రైలాపూర్ ప్రాంతాలకు చెందిన పలువురు బీజేపీ నాయకులు ఎంపీ నీ కలిసి శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిధుల మంజూరుతో ఆయా ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ప్రజల రాకపోకలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డివిజన్ బీజేపీ అధ్యక్షురాలు శైలజ హరినాథ్, గిర్మాపూర్ మాజీ కౌన్సిలర్ వంగేటి లావణ్య హనుమంత్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు కొండం ఆంజనేయులు, రైలాపూర్ మాజీ సర్పంచ్ బండ నర్సింహా, మాజీ ఉప సర్పంచ్‌లు వంగేటి రవీందర్ రెడ్డి, మెట్టు పెంటా రెడ్డి, బీజేవైఎం జిల్లా మాజీ కార్యదర్శి రాఘవ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు బొక్క మల్లా రెడ్డి, చీర్ల సత్యనారాయణ, బొక్క శ్రీనివాస్ రెడ్డి, మెట్టు హనుమంత్ రెడ్డి, మేకల రవీందర్ రెడ్డి, బొక్క సురేందర్ రెడ్డి, బండి బాబు గౌడ్, వంగేటి బాబుల్ రెడ్డి, రాగం ఆనంద్, చంద్రపాల్ రెడ్డి, బాలరాజ్, మహేందర్ యాదవ్, తలారి నవీన్ తదితరులు పాల్గొన్నారు.